# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శుక్రవారం 27, మార్చి 2026






## పుకార్లను నమ్మవద్దు

★ జిల్లాలో ఇంధన కొరత లేదు

★ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, మార్చి 26, ప్రభాతవార్త:**

జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద రద్దీ కనిపిస్తున్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించి, అధికారులకు తక్షణ సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు కేవలం అపోహలేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరం లేకపోయినా ప్రజలు బంకుల వద్దకు చేరడం వల్లే అనవసర రద్దీ ఏర్పడుతోందని, సరఫరా సజావుగా సాగుతోందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్, పంపిణీ ప్రక్రియ కూడా యథావిధిగా కొనసాగుతోందని పేర్కొన్నారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకు అదనపు కలెక్టర్లు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టినట్లు కలెక్టర్ వివరించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మి పానిక్ బాయింగ్‌కు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం నిల్వలను పర్యవేక్షిస్తోందని, ప్రజలకు ఇంధన వనరులు నిరంతరం అందుబాటులో ఉంటాయని భరోసా ఇచ్చారు.

## వంతెనలు నిర్మించి ప్రజలను కాపాడండి



**ఉట్నూర్, మార్చి 26, ప్రభాతవార్త :**

వంతెనలు నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చవాన్ అన్నారు. గురువారం మండలంలోని శ్యామ్ పూర్ వంతెన, జాతీయ రహదారి పై రాస్తారోకో, ధర్నా ను చేపట్టారు. అయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఎక్స్ రోడ్ నుండి అసిఫాబాద్, బ్రిడ్జిలు దంతన్ పల్లి, కె.బి కాంప్లెక్స్ నాగపూర్ , శ్యామ్ పూర్, ఏందా కాలనీ, ఈశ్వర్ నగర్, ఇంద్రవెల్లి జిన్నింగ్ లను చుస్తే ఎనిమిది బ్రిడ్జిలు వెంటనే నిర్మాణం చేసి ప్రజల ప్రణాలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇట్టి విషయంపై ఐటిడిఏ పిఓ స్పందించి భరత్ చౌహాన్ తో ఫోన్లో మాట్లాడటం జరిగింది. ఆర్ అండ్ బి అధికారులతో పాటు ప్రభుత్వ పెద్దలతో చర్చించి తప్పకుండా జిల్లా కలెక్టర్ మిగతా 2లో..

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం చాలా గొప్ప విషయం




➾ జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య

**జన్నారం, మార్చి 26, ప్రభాతవార్త**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం చాలా గొప్ప విషయమని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య అన్నారు. జన్నారం మండలం అక్కపల్లి గూడెం ఎంపీపీఎస్ పాఠశాలల వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీఎస్ అక్కపెల్లిగూడ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన ప్రాథమిక విద్యను అందించటంలో ఉపాధ్యాయ బృందం మంచి పరిణతి కలిగి ఉన్నారని, ఆ విధంగానే గురుకులంలో 22 మంది విద్యార్థులు సీట్లు సాధించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. ఈ సందర్భంగా సీట్లు పొందిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య సన్మానించారు. అలాగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాజాల శ్రీనివాస్, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన వందేమాతరం ఫౌండేషన్ సిఇవో రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్ది సమాజానికి విలువలు పెంచే విద్యార్థులను తయారుచేయడంలో ఈ పాఠశాల ముందుందని,

మిగతా 2లో..

## అంతరిక్ష కలలకు రెక్కలు..



- ఆసిఫాబాద్ విద్యార్థుల ఇస్రో యాత్ర
- ఐఎస్ఆర్ఓ శ్రీహరికోట పర్యటనతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెంపు
- అరుదైన అనుభవంతో భవిష్యత్తు లక్ష్యాలపై దృష్టి

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 26, ప్రభాతవార్త**

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అరుదైన అవకాశంగా నిలిచిన అంతరిక్ష విద్యా పర్యటన విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్‌సిఇఆర్‌టి) డైరెక్టర్ జి. రమేశ్ ఉత్తర్వుల మేరకు నిర్వహించి నిర్వహించిన ఖగహార్ ఇండియన్ కా మూన్‌షాట్ – శ్రీహరికోట విజిట్ 2026" కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపికై ఐఎస్ఆర్ఓ విద్యా పర్యటనలో పాల్గొన్నారు. మార్చి 25 నుంచి 27 వరకు నిర్వహించిన ఈ యాత్రలో రాష్ట్రంలోని ఏడు జిల్లాల నుంచి మొత్తం 72 మంది 8, 9 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్లానెటరి సొసైటి ఆఫ్ ఇండియా, అగస్త్య ఇంటర్నేషనల్ మిగతా 2లో..

## పోలీసుల ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరం



- ✻ 150 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించిన పోలీసులు
- ✻ 24 మందికి కళ్లద్దాల పంపిణీ, ఐదుగురికి త్వరలో కంటి శస్త్రచికిత్స
- ✻ చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ వెల్లడి

**చెన్నూరు, మార్చి 26, ప్రభాతవార్త**

వాహన చోదకుల భద్రత నేపథ్యంలో వారికి దృష్టిలోపం ఉండకూడదనే ఉద్దేశ్యంతో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేసినట్లు చెన్నూరు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలో గురువారం రోజు రామగుండం కమిషనర్ ఆదేశాల మేరకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా చెన్నూర్ టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్ ఆధ్వర్యంలో మిగతా 2లో..

# అంతరిక్ష కలలకు రెక్కలు..

(మొదటిపేజీ తరువాయి)

ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. జిల్లాకు చెందిన జన్కాపూర్, వేంపల్లి, రాస్పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి జంపాల కార్తీక్, లోనారి శివచరణ్, కుచ్చుల సాక్షిత్, వసాకె దిలీప్, ఆసంపల్లి హర్షిత్, ఉల్లి ఆకాష్, కర్నె అంజన్న ఈ పర్యటనకు ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె. లలిత తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ పర్యవేక్షణలో విద్యార్థుల భద్రతా చర్యలు తీసుకొని, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ యాత్రలో భాగంగా విద్యార్థులు శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌ను సందర్శించి రాకెట్ ప్రయోగాల విధానం, ఉపగ్రహాల నిర్మాణం, ఆధునిక అంతరిక్ష సాంకేతికతలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతేకాకుండా శాస్త్రవేత్తలతో జరిగిన ముఖాముఖి చర్చల ద్వారా తమ సందేహాలకు సమాధానాలు పొందారు. ఈ అనుభవం విద్యార్థుల్లో విజ్ఞాన శాస్త్రంపై మరింత ఆసక్తిని పెంచిందని ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇలాంటి అవకాశాలు లభించడం విశేషమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ఏపీజె అబుల్ కలాం ఖగయువ మేధస్సులను



ప్రేరేపించడం" అనే లక్ష్యానికి అనుగుణంగా నిర్వహించబడింది. ఈ యాత్రకు సంబంధించిన ప్రయాణం, వసతి, ఆహారం వంటి అన్ని ఖర్చులను అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ భరించడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కూడా ఈ అరుదైన అవకాశం అందించింది. విద్యార్థులు మాట్లాడుతూ ఇస్రో సందర్శన మా జీవితంలో ఒక మలుపు. భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా మారి దేశానికి సేవ చేయాలనే సంకల్పం కలిగింది" అని ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించి ఎక్కువ మంది విద్యార్థులకు అవకాశాలు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారులు సూచించారు.

# అటవీ సంరక్షణ అందరి బాధ్యత

**వేమనపల్లి, మార్చి 26, ప్రభాతవార్త**

అటవీ సంరక్షణ అందరి బాధ్యతని అటవీ సెక్షన్ అధికారి బేగ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం కల్లంపల్లి, జాజులపేట గ్రామాలలో అటవీ రక్షణ, అటవీ జంతువుల వేట, అడవిలో సంభవించే నిప్పు నివారణ చర్యలు వంటి పలు అంశాల మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సమిస్తున్న తరుణంలో అటవీ సమీపంలో మంటలు పెట్టొద్దని అందరి సహకారంతోనే అడవుల రక్షణ సాధ్యమవుతుందన్నారు. ఇందులో బీట్ అధికారి సాగర్, సర్పంచ్ అలం లక్ష్మణ్, ఉప సర్పంచ్ ఆత్రం శంకర్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, గ్రామస్తులు అటవీ సిబ్బంది పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

# కోల్ ఇండియా స్థాయిలో రాణించిన బెల్లంపల్లి క్రీడాకారుడు

## - బంగారు పతకంతో మెరిసిన మురళీకృష్ణ

**బెల్లంపల్లి, మార్చి 26, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ఏరియాకు చెందిన సింగరేణి ఉద్యోగ క్రీడాకారుడు కోల్ ఇండియా స్థాయిలో బంగారు పతకం సాధించడంతో ఆయనను బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి గురువారం రోజు గోలేటి జీఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఒడిశా రాష్ట్రంలోని మహానది కోల్ ఫీల్డ్స్ (ఎంసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన కోల్ ఇండియా స్థాయి లాన్ టెన్నిస్ క్రీడా పోటీలలో గోలేటి సిహెచ్‌పి విభాగానికి చెందిన జి.మురళీకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌గా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తరపున పాల్గొన్నారు. ఈ పోటీలలో ఆయన అత్యుత్తమ ప్రతిభ కనబరచి వెటరన్ డబుల్స్ టెన్నిస్ విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎం.విజయభాస్కర్ రెడ్డి మురళీకృష్ణకు జ్ఞాపికను అందజేసి అభినందించారు. క్రీడా రంగంలో ఉద్యోగులు సాధిస్తున్న విజయాలు సంస్థకు గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్. తిరుపతి, డీజీఎం (సివిల్) ఎస్కే మదీనా బాషా, పర్సనల్ డిపార్ట్మెంట్ హెడ్ ఎస్వీ రాజేశ్వర్ రావు, క్వాలిటీ హెడ్ రాజేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్లు ఎం. శ్రీనివాస్, డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ గౌరవ కార్యదర్శి డి. ప్రశాంత్, మారం శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వంతెనలు నిర్మించి ప్రజలను కాపాడండి

(మొదటిపేజీ తరువాయి)

ఆధ్వర్యంలో సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు,పిఓ యువరాజ్ మర్మాట్ హామీ మేరకు కార్యక్రమాన్ని విరమించారు . ఇట్టి కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ రషీద్, కాటం రమేష్, ముకుందరావు,జాంబ్లీ పాండురంగ, సన్నీ జాదవ్, ఆడే సుభాష్, అంబర్ సింగ్ మహారాజ్, ఆనంద్ రావు మహారాజ్, మరప బాలాజీ,సిదాం విజయ్,ఇంద్రు, ధన్రాజ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం చాలా గొప్ప విషయం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాలలను బ్రతికించాలని విద్యార్థుల తల్లిదండ్రులను గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పొన్కల్ గ్రామ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, జన్నారం సర్పంచ్ అజ్మీరా కళావతి నందు నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి ఎం భరత్ ఎస్వో 1, ఏ సత్యనారాయణ మూర్తి ఎస్వో 2, చౌదరి ఎస్వో 3, విజయలక్ష్మి ఎస్వో 4, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముజఫర్ అలీ, మండల విద్యాధికారి ఎన్ విజయ్ కుమార్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో కంటి పరీక్ష శిబిరం

(మొదటిపేజీ తరువాయి)

చెన్నూర్ బస్ స్టాండ్ ఆవరణలో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ భాస్కర్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడంలో స్పష్టమైన చూపు అత్యంత ముఖ్యమని, ప్రతి డ్రైవర్ సమయానుకూలంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ పాటించాలని అన్నారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది ఆటో, టాక్సీ డ్రైవర్లు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారని, వీరిలో 24 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందించగా, ఐదుగురికి కంటి శస్త్రచికిత్స కోసం ఎంపిక చేసి పంపించామని తెలిపారు. అనంతరం పట్టణంలోని గాంధీ చౌక్ ప్రాంతంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు పట్టణ ఎస్ఐలు శ్యాం పటేల్, సుబ్బారావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గేదెలను కాపాడబోయి వ్యక్తి మృతి

**లక్షెట్టిపేట, మార్చి 26, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూరుకు చెందిన తనుగుల రాజలింగం (46) గంపలపెల్లి చెరువులో పడి మరణించాడు. బుధవారం ఉదయం తన బర్లను మేపేందుకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందని ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. నీట మునిగిన రాజలింగం మృతదేహం గురువారం ఉదయం చెరువులో లభ్యమైంది. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసే రాజలింగం రోజూ ఉదయం తన మూడు బర్లను మేతకు తీసుకెళ్లేవాడు. బుధవారం గంపలపెల్లి చెరువు సమీపంలో బర్లను మేపుతుండగా మరో వ్యక్తికి చెందిన పశువులు నీటిలోకి వెళ్లాయి. వాటిని బయటకు తెచ్చే ప్రయత్నంలో రాజలింగం ప్రమాదవశాత్తు లోతులోకి వెళ్లి మునిగిపోయాడు. బుధవారం గాలించినా ఆనవాళ్లు దొరకలేదు. గురువారం ఉదయం శవం నీటిపై తేలడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థుల డిజిటల్ ఓటు వికసిత భారత్‌కు నాంది

- డిజిటల్ ఓటుతో చరిత్ర సృష్టించిన స్లేట్ ఎక్స్‌లెన్స్ సిబిఎస్ఈ పాఠశాలవిద్యార్థులు
- జన్నారం స్లేట్ ఎక్స్‌లెన్స్‌లో విజయవంతంగా డిజిటల్ మోక్ ఎలక్షన్స్
- 9వ తరగతి విద్యార్థి రాగుల అవినాష్ రూపొందించిన సాఫ్ట్‌వేర్‌తో ఓటింగ్
- ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థులకు అవగాహన



జన్నారం, మార్చి 26, ప్రభాతవార్త

నేటి ఆధునిక యుగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదని జన్నారంలోని స్లేట్ ఎక్స్‌లెన్స్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు నిరూపించారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన డిజిటల్ మాక్ ఎలక్షన్స్ ప్రజాస్వామ్యానికి అద్దం పట్టేలా వికసిత భారత్ లక్ష్యంతో, విద్యార్థుల్లో ఓటు హక్కుపై చైతన్యం కల్పించేందుకు నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం అందరినీ ఆశ్చర్యపరిచింది.

**ప్రజాస్వామ్యానికి సాంకేతికత తోడు..**

ఈ ఎన్నికల ప్రత్యేకత ఏమిటంటే, దీనికి వాడిన వ్యవస్థను 9వ తరగతి చదువుతున్న రాగుల అవినాష్ అనే విద్యార్థి స్వయంగా రూపొందించాడు. నిజమైన ఎన్నికలను తలపించేలా ప్రతి విద్యార్థికి ఒక యూనిక్ ఓటర్ ఐడి మరియు పాస్వర్డ్ కేటాయించారు. వీటిని నమోదు చేసిన తర్వాతే డిజిటల్ పద్ధతిలో ఓటు వేసే సౌకర్యం కల్పించారు. దీనివల్ల ఎన్నికల పారదర్శకత మరియు గోప్యత గురించి విద్యార్థులకు ప్రాక్టికల్‌గా అవగాహన కలిగింది. పాఠశాలను విస్డమ్ , కరేజ్, హార్మొనీ,ఇంటెగ్రిటీఅనే నాలుగు హౌస్‌లుగా విభజించి, హౌస్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్‌తో పాటు హెడ్ బాయ్, హెడ్ గర్ల్, వైస్ హెడ్ బాయ్, వైస్ హెడ్ గర్ల్, కల్చరల్ మినిస్టర్స్, స్పోర్ట్స్ మినిస్టర్స్‌ను విద్యార్థులు తమ ఓటు హక్కుతో ఎన్నుకున్నారు.

**నాయకత్వ లక్షణాలే లక్ష్యం..**

ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ డాక్టర్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశం వికసిత్ భారత్ గా మారాలంటే సాంతికత, ప్రజాస్వామ్య విలువలు రెండు ఒకే వేదిక పైకి రావాలని మా విద్యార్థులు ఈ రెండింటిని అద్భుతంగా ప్రదర్శించారని వారిని అభినందించారు. పుస్తకాల్లోని పాఠాలను క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా నేర్పడమే తమ ఉద్దేశమని తెలిపారు. ప్రిన్సిపాల్ శిరీన్ ఖాన్ మాట్లాడుతూ, ఇలాంటి వినూత్న ప్రయోగాలు విద్యార్థుల్లో నాయకత్వ పటిమను, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రధానోపాధ్యాయురాలు శిరిన్ ఖాన్, ఉపాధ్యాయులు కృష్ణ, జాకీర్, అమల్జేన్ఫీల్డ్ స్లే ,శంకర్, భానుచందర్ ముఖ్య భూమిక పోషించారని తెలిపారు.విద్యార్థులు క్రమశిక్షణతో ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని, ప్రజాస్వామ్య విలువలను చాటిచెప్పారని, జన్నారం ప్రాంతంలో ఒక పాఠశాల స్థాయిలో ఇలాంటి డిజిటల్ విప్లవం రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

# కౌన్సిలర్ శివకృష్ణ అధ్వర్యంలో స్వాములకు మహాబిక్ష కార్యక్రమం

**600 మంది స్వాములకు అన్న ప్రసాదం వితరణ - ప్రతి ఏటా తన భక్తిని చాటుకుంటున్న శివకృష్ణ**



చెన్నూరు, మార్చి 26, ప్రభాతవార్త

దైవం మానవ రూపంలో ఉందంటారు. దానికి ఉదాహరణే చెన్నూరు పట్టణానికి చెందిన 18 వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణ. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణానికి చెందిన కౌన్సిలర్ ఏతం శివకృష్ణ అంటే మండలంలో తెలియని వారు ఉండరు. తన మంచితనం, స్వభావం, దయాగుణం కారణంగా తాను చేపట్టే సేవా కార్యక్రమాలే అతన్ని చెన్నూరు కౌన్సిలర్‌గా గెలిపించింది. ప్రతి ఏటాతన భక్తితో నిర్వహించే మహా భిక్ష కార్యక్రమంలో భాగంగా హనుమాన్ దీక్ష స్వాములకు గురువారం రోజు సుమారు 600 మంది స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేసి తన భక్తిని చాటుకున్నాడు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ సనాతన ధర్మంలో భాగంగా ప్రతి సంవత్సరం ఇలాంటికార్యక్రమాలు నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నానని, ఇవి నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయని తెలిపారు. ఆ భగవంతుడి దయతో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నామీద గౌరవంతో తరలివచ్చిన స్వాములకు, ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడంలో వెన్నంటి ఉన్న నా మిత్రులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

# శ్రీ సరస్వతి శిశు మందిరంలో శ్రీరామనవమి వేడుకలు



భైంసా, మార్చి 26, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని గుజరి గల్లీలో ఉన్న శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో గురువారం శ్రీరామనవమి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో శ్రీరాముడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి భజనలు, కీర్తనలు చేశారు. శ్రీరాముని జన్మోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలను పూలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. విద్యార్థులు శ్రీరాముని జీవిత గాథను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ.. శ్రీరాముడు ధర్మం, నిజాయితీకి ప్రతీక అని, ఆయన ఆదర్శాలను విద్యార్థులు ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నాళాల పూడిక తీస్తున్న దృశ్యం

# అభివృద్ధి పనులు చేపట్టిన సర్పంచ్

వేమనపల్లి, మార్చి 26, ప్రభాతవార్త

మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం గ్రామ సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మెయిన్ రోడ్లపై కొంతకాలంగా నాలీలు మట్టితో నిండిపోయి మురికి నీరు రోడ్లపైకి వస్తున్న సందర్భంగా జెసిబి, ట్రాక్టర్ సాయంతో రోడ్డుకు ఇరువైపుల మట్టిని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా తీర్చిదిద్దడమే నా యొక్క లక్ష్యం అని అన్నారు.




# గురుకులం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

జన్నారం, మార్చి 26, ప్రభాతవార్త

జన్నారం మండలం ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఎస్. సందీప్, డి. అవంతిక, జె. తన్మయి శ్రీ, పి. హర్షిణి, జె. అరుష్, ఎన్. అహల్య. డి. శ్రీజన్ కుమార్, బి. కీర్తనలు గురుకులం ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారని ఎమ్‌పియుపిఎస్ ప్రధానోపాధ్యాయులు ఎంబడి సత్తన్న తెలిపారు. గురుకులం ప్రవేశ పరీక్షలో ఎనిమిది విద్యార్థులు ప్రతిభ కనబరిచి సీట్లు సాధించడం గొప్ప విషయమని మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రశంసించారు.

# కొత్తపేట పాఠశాలలో ముందస్తు శ్రీరామ నవమి వేడుకలు

**- అలరించిన చిన్నారులు**

జన్నారం, మార్చి 26, ప్రభాతవార్త

జన్నారం మండలంలోని కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో శ్రీరామనవమి వేడుకలు గురువారం కన్నుల పండుగగా జరిగాయి. పండుగను పురస్కరించుకొని విద్యార్థులు సీతారాముల వేషధారణలో మెరిసిపోయారు. చిన్ని రామయ్యగా, సీతమ్మ తల్లిగా అలంకరించుకున్న చిన్నారుల ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బిక్కు మాట్లాడుతూ, విద్యార్థులకు చిన్నతనం నుంచే మన సంస్కృృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలు సౌందర్య ఆధ్వర్యంలో విద్యార్థులకు రామాయణ విశిష్టతను వివరించారు. అనంతరం వేషధారణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు. పాఠశాల ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది.




విద్యార్థులకు విపత్తుల జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

## విపత్తుల సమయంలో అప్రమత్తతే రక్షణ

### - ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్

సారంగాపూర్, మార్చి 26, (ప్రభాతవార్త):

ప్రకృతి విపత్తుల సమయంలో ప్రతి విద్యార్థి ధైర్యసాహసాలతో వ్యవహరించి ప్రాణనష్టాన్ని నివారించాలని ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్ యాదవ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఆధ్వర్యంలో విపత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరదలు, భూకంపాలు, భవనాలు కూలినప్పుడు, రసాయన అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు ఎలా కాపాడుకోవాలో విద్యార్థులకు వివరించారు. ప్రమాద సమయాల్లో తోటి వారిని రక్షించే మెలకువలను ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపారు. ప్రతి విద్యార్థి దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, సర్పంచ్ కోనేరు భూమన్న, ప్రధానోపాధ్యాయురాలు కె. విజయ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది ఓబులేసు, దూలప్ప, విశాల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న బీఆర్ఎస్ జిల్లా ఇన్చార్జ్ రామ్ కిషన్ రెడ్డి

## కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన రామ్‌కిషన్‌రెడ్డి

సారంగాపూర్, మార్చి 26, (ప్రభాతవార్త):

మండలంలోని బీరవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బాలేరు ప్రవీణ్ మామ, ఆర్ఎంపీ డాక్టర్ తిరుపతి (48) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నిర్మల్ జిల్లా ఇన్చార్జ్ రామ్ కిషన్ రెడ్డి గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తిరుపతి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవి శంకర్, లక్ష్మణచందా మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, వంజర్ మాజీ సర్పంచ్ శ్యామ్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, ధనుంజయ్, లక్ష్మణ్, గంగయ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కౌన్సిలింగ్‌తో ఒక్కటైన దంపతులు: ఎస్పీకి కృతజ్ఞతలు

భైంసా, మార్చి 26, (ప్రభాతవార్త):

భైంసా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం కుటుంబ సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తోంది. మనస్పర్థలతో విడిపోయిన ఓ జంట పోలీసుల కౌన్సిలింగ్‌తో మనసు మార్చుకుని మళ్లీ ఒక్కటయ్యారు. గురువారం వారు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భైంసా పట్టణానికి చెందిన సదరు భార్యాభర్తలు గత కొన్ని నెలలుగా విభేదాల కారణంగా దూరంగా ఉంటున్నారు. తమ సమస్య పరిష్కారం కోసం వారు ప్రజావాణిని ఆశ్రయించారు. వారి సమస్యను సావధానంగా విన్న పోలీసులు, దంపతులకు కౌన్సిలింగ్ నిర్వహించి పరస్పర అవగాహన కల్పించారు. పోలీసుల చొరవతో తమ పొరపాట్లను తెలుసుకున్న ఆ జంట, విభేదాలను పక్కన పెట్టి కలిసి జీవించేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా దంపతులు ఎస్పీకి, పోలీసు సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.




# నేత్ర, అవయవ, శరీర దానంపై బెల్లంపల్లిలో మహా చైతన్యం

### ఘనంగా నిర్వహించిన 2కె రన్ - చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు దంపతులు ఆదర్శం






బెల్లంపల్లి, మార్చి 26, (ప్రభాతవార్త)

బెల్లంపల్లి పట్టణంలో నేత్ర, అవయవ మరియు శరీర దానంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె రన్ (అవగాహన ర్యాలీ) ఎంతో ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వాకర్స్ గ్రూపులు, మహిళా సంఘాలు, ఆశా కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ అవగాహన ర్యాలీని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి జెండా ఊపి ప్రారంభించారు. పురపాలక సంఘం కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ కాంట చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో పాల్గొన్నవారు నేత్రదానం - మహాదానం, అవయవ దానం - ప్రాణదానం, శరీర దానం - విజ్ఞాన దానం వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. కాంట చౌరస్తా వద్ద ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించి, నేత్ర, అవయవ దానం ప్రాముఖ్యతపై ప్రజలకు వివరించారు. అనంతరం ర్యాలీ తిరిగి ప్రారంభ స్థలానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ సమాజంలో ఇంకా ఉన్న అపోహలు, భయాలు వల్ల చాలా మంది నేత్ర, అవయవ దానానికి ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. అయితే శాస్త్రీయ అవగాహన పెరిగిన ఈ కాలంలో ప్రజలు ఈ అపోహలను విడిచిపెట్టి మానవతా దృక్పథంతో దానం చేయాలని కోరారు. ఒక వ్యక్తి మరణానంతరం చేసిన నేత్రదానం ఇద్దరు అంధులకు చూపును ఇస్తుందని, అవయవ దానం ద్వారా అనేకమందికి ప్రాణాలు నిలబెట్టవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా నేత్ర, అవయవ దానానికి అంగీకారం తెలుపుతూ అంగీకార పత్రంపై సంతకం చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు దంపతులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజా ప్రతినిధులుగా వారు చూపించిన ఈ ఆదర్శం సమాజానికి మంచి సందేశమని కొనియాడారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ మాట్లాడుతూ మనిషి మరణానంతరం శరీరం మట్టిలో కలిసిపోతుంది కానీ అదే శరీరాన్ని సమాజానికి ఉపయోగపడేలా దానం చేస్తే అది ఎన్నో ప్రాణాలను రక్షించే గొప్ప సేవగా నిలుస్తుందని చెప్పారు. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో చర్చించి నేత్ర, అవయవ, శరీర దానానికి అంగీకారం తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో అంగీకార పత్రంపై సంతకం చేసి బెల్లంపల్లి ప్రథమ పౌరురాలిగా ఆదర్శంగా నిలిచారు. సదశయా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సిహెచ్. లింగమూర్తి మాట్లాడుతూ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు వెలుగుని అందించవచ్చని, మరణించిన ఎనిమిది గంటలలోపు నేత్రదానం చేయడం సాధ్యమని తెలిపారు. అలాగే బ్రెయిన్ డెడ్ పరిస్థితుల్లో గుండె, కిడ్నీలు, కాలేయం వంటి ముఖ్య అవయవాలను దానం చేయడం ద్వారా ఆరుగురికి ప్రాణదానం చేయవచ్చని వివరించారు. శరీర దానం ద్వారా మెడికల్ కాలేజీలలో చదువుతున్న వైద్య విద్యార్థులకు ప్రయోజనం కలిగి, వైద్యరంగ అభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు అడెపు సతీష్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పటివరకు 13 నేత్రదాన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. నేత్రదానం అంటే మొత్తం కన్నును తీస్తారని ఉన్న అపోహలు పూర్తిగా తప్పని, కేవలం కార్నియా అనే పారదర్శక పొరను మాత్రమే తీసుకుంటారని వివరించారు. ఈ అవగాహనతో మరింత మంది ముందుకు రావాలని కోరారు. ఇటీవల నెలరోజుల వ్యవధిలో బెల్లంపల్లి పరిసర ప్రాంతాల్లో బింగి అశోక్ కుమార్, కొట్టే సత్యప్రకాష్, లింగంపల్లి వర్షిత, ఆయిల్ల మల్లేష్ కుటుంబ సభ్యుల సహకారంతో నాలుగు నేత్రదాన కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయం అని నిర్వాహకులు తెలిపారు. వారి స్ఫూర్తితో మరింత మంది ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే జనహిత సేవా సమితి 9వ వార్షికోత్సవం సందర్భంగా మార్చి 29 ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బెల్లంపల్లి తాపీ సంఘ భవనంలో నేత్ర, అవయవ, శరీర దాన అవగాహన సదస్సు మరియు అంగీకార పత్రాల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, ఏసీపీ కిరణ్ కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, పోలీసు శాఖ సిబ్బంది, కౌన్సిలర్ సభ్యులు, ఆశా కార్యకర్తలు, ఐకెపి మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తిలక్ వాకర్స్, ఎఎంసి గ్రౌండ్ వాకర్స్, మార్వాడి యువ మంచ్, అమ్మఒడి, సదశయా ఫౌండేషన్ సభ్యులు, మీడియా మిత్రులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి నిర్వాహకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్‌కు ప్రత్యామ్నాయ భవనం

### అధికారుల పరిశీలన



బెల్లంపల్లి, మార్చి 26, (ప్రభాతవార్త)

మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో బెల్లంపల్లి పట్టణానికి సంబంధించిన కీలక అంశంపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా రడగంబాల బస్తీలో ఉన్న ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడం, విద్యార్థుల భద్రతకు ముప్పుగా మారిన నేపథ్యంలో వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం, కొత్త హాస్టల్ భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న విద్యార్థులను సురక్షితమైన ప్రదేశానికి తరలించాలనే నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలికంగా హాస్టల్‌ను ఇతర అనుకూలమైన భవనానికి మార్చేందుకు అధికారులు పరిశీలనలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఈరోజు బెల్లంపల్లి పట్టణంలోని పాత జీఎం ఆఫీస్ భవనాన్ని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రేణికుంట్ల ప్రవీణ్, సబ్ కలెక్టర్ మనోజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్ కలిసి సందర్శించి పరిశీలించారు. భవనం నిర్మాణ స్థితి, గదుల సౌకర్యం, విద్యార్థుల వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, భద్రతా అంశాలు వంటి అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించారు. పాత జీఎం ఆఫీస్ భవనం తాత్కాలికంగా హాస్టల్ నిర్వహణకు అనుకూలమా కాదా అనే విషయంపై సాంకేతికంగా అంచనా వేసి, తగిన సవరణలు అవసరమైతే వెంటనే చేపట్టాలని అధికారులు సూచించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిలుక రాజనర్సు, హాస్టల్ వార్డెన్స్, ఇతర శాఖల అధికారులు కూడా పాల్గొన్నారు. వారు కూడా భవనం పరిస్థితులను పరిశీలించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. అంతేకాకుండా, హాస్టల్ విద్యార్థుల విద్యాభ్యాసం దెబ్బతినకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక మార్పిడి ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. త్వరలోనే పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి, తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీరామ నవమి వేడుకలు


## నేడు సీతారాములు కల్యాణోత్సవం...

**తాండూర్, మార్చి 26, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం టౌన్షిప్ లో గల శ్రీ కోదండ రామాలయంలో గురువారం సాయంత్రం శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విగ్వరణం, దీక్షధారణ, అంకురార్పణ, కలశ స్థాపన కార్యక్రమాలను ఆలయ అర్చకులు వేద పండితులు వైభవంగా జరిపించారు. శ్రీ సీతారాముల స్వామి వారి ఎదుర్కోలు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 27న ఉదయం 8 గంటలకు ధ్వజరోహణ, శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం 12:50 గంటలకు పునర్వసు నక్షత్ర యుక్త కర్కాటక అజిత్ లగ్న సుముహూర్తమున శ్రీసీతారామచంద్ర వారి కళ్యాణ మహోత్సవం పంచాహ్నిక దీక్షతో జరుగును. సాయంత్రం 6 గంటలకు అగ్ని ప్రతిష్టాపన, ఔపోసన, బలిహరణ నిర్వహిస్తారు. 28న ఉదయం 10 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, 31న పూర్ణాహుతి, పవళింపు సేవా కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఔపోసన, బలిహరణ, తీర్థ ప్రసాదాల వితరణ జరుగుతాయని ఆలయ అర్చకులు ముద్దు అవధూత శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీరామనవమి వేడుకల కోసం ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని రంగు,రంగు దీపాలతో అందంగా అలంకరించి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణం, నవమి ఉత్సవాలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.



1978 సంవత్సరంలో 100 సింగరేణి క్వార్టర్లతో ప్రారంభించబడిన మాదారం టౌన్ షిప్ 1982 వరకు 8500 క్వార్టర్లతో 1000 పైగా గుడిసెలతో 5000 మంది జనాభాతో కళకళలాడుతూ ఉండేది. మాదారం టౌన్షిప్ లో నివాసం ఉంటున్న కార్మికులు, కార్మికేతరులు పండుగలు, పర్వదినాలు వచ్చినప్పుడు దైవదర్శనం కోసం తాండూర్, బెల్లంపల్లి పట్టణాలకు ఆలయాలకు వెళ్లేవారు. మాదారం టౌన్ షిప్ లో ఒక ఆలయం నిర్మించుకోవాలని కార్మికులు, స్థానికులు కల్పించారు. 1984లో ఆలయం నిర్మాణం కోసం స్థలం నిర్ణయించి కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ జయేంద్ర సరస్వతి వారిని ఆహ్వానించి పీఠాధిపతి కరకరములుచే శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేయించారు. అప్పటి బొగ్గు గనులఏజెంట్ జబ్బర్ ఆధ్వర్యంలో అధికారులు విట్టల్, దత్తాత్రేయ శాస్త్రీ హరిబాబు, భట్టాచార్యులను కమిటీ సభ్యులుగా నియమించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సింగరేణి సహకారం, కార్మికుల విరాళాలతో రూ. రెండు లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. మద్రాస్ నుండి దాదాపు రూ.80 వేల రూపాయలు విలువ గల శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలను తెప్పించారు. 1986 సంవత్సరంలోఏప్రిల్ 10న శ్రీ అక్షయ నామ సంవత్సరం (ఉగాది) పర్వదినాన పుష్పగిరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యా నృసింహా భారతి తీర్థ స్వామి దివ్యకరకరములచే విగ్రహ ప్రతిష్టపాన మహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా జరిగింది. మాదారం టౌన్షిప్ లోని శ్రీ కోదండ రామాలయంలో గత నాలుగు దశాబ్దాలుగా శ్రీరామనవమి, గణేష్ నవరాత్రులు, దేవీ నవరాత్రులు వైభవముగా నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ప్రతి ఏటా శ్రీ సీతారాముల స్వామికి ఎదుర్కోలు, సీతరాముల కళ్యాణ మహోత్సవం, శ్రీరామ పట్టాభిషేకం, పూర్ణాహుతి పవళింపు వంటి కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేద పండితులు ముద్దు అవధూత శర్మ దంపతుల చేత కన్నుల పండుగగా జరిపిస్తారు. ఈ కోదండ రామాలయం ఆవరణలో 1995లో వినాయకుడు, అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, నవగ్రహాల ఉప ఆలయాలను నిర్మించారు. సీతారాముల కళ్యాణ మహోత్సవానికి తాండూర్, బెల్లంపల్లి, రెబ్బెన, భీమిని, తదితర మండలాల నుంచి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణాన్ని తిలకిస్తారు.



## నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా బానోత్ జగన్ నాయక్ ఎన్నిక

**ఉట్నూర్, మార్చి 26,ప్రభాతవార్త :**

ఉట్నూర్ మండలం నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులు గా బానోత్ జగన్ నాయక్ ను ఎన్నికల అధికారి రాజు ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. ఉప అధ్యక్షులుగా పవార్ వసంత్ రావు, ప్రధాన కార్యదర్శిగా బానోత్ జైవ్రత్ రావు,జాయింట్ సెక్రటరీగా అశోక్,కోశాధికారిగా కురివెత శ్రీనివాస్,వినోద్, విశాల్లను కూడా ఎన్నుకున్నారు. జగన్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నుకున్న ప్రతి ఒక న్యాయవాదులను ధన్యవాదములు తెలిపారు. న్యాయవాదులకు ఎలాంటి ఇబ్బందిలు వచ్చిన ముందు ఉండి న్యాయం చేస్తా అన్ని అన్నారు.



ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులు




మందులు అందజేస్తున్న వైద్యుడు బియ్యాల వెంకటేష్

## కోసినీ,పర్ధాన్ గుడాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

**కాగజ్‌నగర్ రూరల్,మార్చి 26, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని కోసినీ,పర్ధన్ గూడలో సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పేద ప్రజలకు ఉచితంగా కంటి పరీక్ష నిర్వహించడం ద్వారా మాకు ఎంతో ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో వచ్చిన వారికి కంటి వైద్యుడు బియ్యాల వెంకటేష్ కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుల్లాబాయి మాట్లాడుతూ కోసిని గ్రామంలో ఉచిత కంటి పరీక్ష నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది అని అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో, మాలి సంఘం కాగజ్ నగర్ మండల్ జనరల్ సెక్రెటరీ వసాకే హనుమంతు, సిఎస్ఆర్ మేనేజర్ రేవతి, డాక్టర్ బియ్యాల వెంకటేశ్వర్, సుశీల, శివకుమార్, తన్నీరు విజయ్ కుమార్,అంగన్వాడి టీచర్ చిన్నారి, వార్డ్ మెంబర్స్ రాజేష్, రోజా,కంటి ఆసుపత్రి సిబ్బంది శ్రీనివాస్, గ్రామ పెద్దలు మహిళలు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ అభ్యర్థులు జమా, ఖర్చుల వివరాలు అందజేయుటకు నేడే ఆఖరు

**క్యాతన్‌పల్లి, మార్చి 26, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో జరిగిన 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేసిన అభ్యర్థులు ఖర్చుల వివరాలు అందజేయుటకు నేడే ఆఖరు అని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం, ఆదేశాల ప్రకారం ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి 45 రోజుల లోపు ఎన్నికల ఖర్చు వివరాలు నిర్ణీత ఫారంలో పూరించి అందజేయాలని కోరారు. ఎన్నికల ఖర్చు యొక్క ఫారములు పురపాలక సంఘం, క్యాతన్‌పల్లిలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు. నిర్ణీత గడువు లోపున ఎన్నికల ఖర్చు వివరములు పురపాలక సంఘం, క్యాతనపల్లిలో సమర్పించని పక్షంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం తీసుకొనే చర్యలకు మీరు బాధ్యులు అవుతారని హెచ్చరించారు.

## భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్,ప్రభాతవార్త**



బాలసదనం భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో చేపట్టిన బాలసదనం భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 1 కోటి 34 లక్షల రూపాయల మిషన్ వాత్సల్య అంచనా నిధులతో బాలసదనం భవన నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**పెంచికల్ పేట్, మార్చి 26, ప్రభాతవార్త**



మండలంలోని పెంచి కల్‌పేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం సర్పంచ్ షేక్ ఉస్మాన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సముద్రాల రాజన్న కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, ఎమ్మెల్సీ దండే విఠల్ నాయకత్వంలో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చెప్పడతామని తెలిపారు.వర్షాకాలంలో బురద, గుంతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు సీసీ రోడ్ల నిర్మాణంతో సౌకర్యవంతంగా ప్రయాణం చేయగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేఖర్, నాయకులు పూరషోత్తం, నందు, చందు తదితరులు పాల్గొన్నారు.

## 108 ఎడ్ల బండ్లతో పచ్చని పాలపోరక శోభయాత్ర

**ఉట్నూర్, మార్చి 26,ప్రభాతవార్త :**

శ్రీరామనవమి శుభ సందర్భంగా గురువారం 108 ఎడ్ల బండ్లలో పచ్చని పాలపోరక శోభాయాత్ర నిర్వహించగా ఉట్నూర్ ఏఎస్పీ రిత్విక్ సాయి పూజలు చేసి ప్రారంభించారు. శ్రీ శివరామ గురుదత్త సాయి కృష్ణ మందిరంలో శ్రీ సీతారాముల కళ్యాణం జరగనుండగా కళ్యాణ తంతు కార్యక్రమంలో భాగంగా శోభాయాత్ర నిర్వహించారు. ఆలయ అధ్యక్షులు పాత రవీందర్ పురోహితులు సంతోష్ దూబే, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.





## ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

### - ఎంపిఓ బాపు రావు

జైపూర్, మార్చి 26, ప్రభాతవార్త

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న మురికి కాలువ చివరన ఇంకుడు గుంతల ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎం.పి.ఓ బాపు రావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం జైపూర్, పెగడపల్లి గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేస్తున్న పారిశుధ్య పనులను, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. పెగడపల్లి శివారులో గల చెత్త నిండి ఉన్న డ్రైనేజీలను పరిశీలించి, పలు సూచనలు చేశారు.గ్రామ పంచాయతీలలో వంద శాతం పన్ను వసూలు పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.ఈ పర్యటనలో జైపూర్ సర్పంచ్ కూన భాస్కర్, పెగడపల్లి సర్పంచ్ రామగిరి రాము, పంచాయతీ కార్యదర్శులు బి. ఉదయ్ కుమార్, శ్రీవాణి సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్ఐ

## పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం

లక్షెట్టిపేట, మార్చి 26, ప్రభాతవార్త

లక్షెట్టిపేట పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవు కార్యక్రమంలో భాగంగా ఆటో డ్రైవర్లతో పాటు ఇతర డ్రైవర్లకు గురువారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్జా ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ఈ నెల 25 నుంచి 31 తారీకు వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వాహన డ్రైవర్లు వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనంపై వెళ్ళేటప్పుడు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని, కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని అందువల్ల కలిగే అనర్థాలపై నష్టాలపై డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లక్షెట్టిపేట పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మనస్తాపంతో రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య

హాజీపూర్,మార్చి 26,ప్రభాతవార్త



భూవివాదం విషయంలో మనస్థాపం చెందిమంచిర్యాల కార్పొరేషన్ 16 వార్డు ముల్కల్లకు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ వార్డు ముల్కల్లకు చెందిన రాగంశెట్టి మల్లేష్ (65) అను అతను సింగరేణి ఉద్యోగం చేసి రిటైర్ అయి ప్రస్తుతం శ్రీరాంపూర్‌లో ఉంటున్నాడు. రామశెట్టి మల్లేష్, తన అన్నదమ్ముల పొత్తుల పోచంపహాడ్ శివారులో 10 గుంటల భూమి ఉంది.అట్టి భూమిలో నుంచి తనకు వచ్చే వాటా భూమి పట్టా కావడం లేదని బాధ పడుతూ జీవితంపై విరక్తి చెంది, మనస్తాపం తో తేదీ బుధవారం రోజు పోచంపహాడ్ శివారులో వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని చనిపోయినాడు. మృతుని కూతురు మోటపలుకుల స్వప్న దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

# బెల్లంపల్లి మున్సిపాలిటీ బడ్జెట్ 202627 ఆమోదం

### రూ. 3186.92 లక్షల వ్యయానికి గ్రీన్ సిగ్నల్ - బెల్లంపల్లి సమగ్ర అభివృద్ధే లక్ష్యం

### ప్రజల సహకారంతోనే బెల్లంపల్లి అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి





బెల్లంపల్లి, మార్చి 26, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన 2025-26 ఆర్థిక సంవత్సర సవరించిన బడ్జెట్, 2026-27 ఆర్థిక సంవత్సరానికి కొత్త బడ్జెట్‌ను మున్సిపల్ అధికారులు అధికారికంగా ఆమోదించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ కార్యాలయం నుండి ప్రకటన విడుదలైంది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదించిన బడ్జెట్ ప్రకారం, 2026-27 సంవత్సరానికి మున్సిపాలిటీకి మొత్తం ఆదాయం రూ. 3186.92 లక్షలుగా అంచనా వేశారు. ఇందులో సాధారణ ఆదాయం రూ. 477.65 లక్షలు కాగా, వివిధ గ్రాంట్ల ద్వారా రూ. 2628.27 లక్షలు, డిపాజిట్లు మరియు ఇతర ఆదాయాల ద్వారా రూ. 81.00 లక్షలు సమకూరనున్నాయి. ఇక 2025 ఏప్రిల్ 1 నాటికి మున్సిపాలిటీకి రూ. 55.11 లక్షల బకాయిలు ఉన్నట్లు నమోదు చేయగా, మొత్తం అందుబాటులో నిధులు రూ. 3242.03 లక్షలకు చేరుకున్నాయి. వ్యయాల పరంగా చూస్తే, సాధారణ ఖర్చులకు రూ.,477.65 లక్షలు, గ్రాంట్ల కింద రూ. 2628.27 లక్షలు, డిపాజిట్ మరియు ఇతర వ్యయాలకు రూ. 81.00 లక్షలు కేటాయించారు. మొత్తం వ్యయం రూ. 3186.92 లక్షలుగా నిర్ధారించగా, అన్ని ఖర్చులు తీర్చిన తర్వాత రూ. 55.11 లక్షల మిగులు బడ్జెట్‌గా ఉండనుంది. ఈ బడ్జెట్ ద్వారా పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ, పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర ప్రజా సేవల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

బెల్లంపల్లి పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులందరి సహకారం అవసరమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు ఆధ్వర్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మొదటి సాధారణ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ పట్టణంలోని 34 వార్డుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మురికి వాగులు, పారిశుధ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. గత రెండేళ్లుగా బెల్లంపల్లి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని మురికివాగులను పూర్తిగా శుభ్రం చేయించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని, అవసరమైతే ముఖ్యమంత్రి సహకారంతో అదనపు నిధులు కూడా తీసుకువస్తానని వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్, కౌన్సిలర్లు, అధికారుల సమన్వయంతో ఒక సంవత్సరంలోపు ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరినీ సమానంగా భావిస్తూ పారదర్శకంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించిన జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మనోజ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## వి.బి.జి.ఆర్.ఎమ్.ఎస్ నిబంధనలను రద్దు చేయాలని వినతి

సారంగాపూర్, మార్చి 26, ప్రభాతవార్త:

ఉపాధి హామీ పనులకు ఆటంకంగా మారిన వి.బి.జి.ఆర్.ఎమ్.ఎస్ నిబంధనలను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం ఏపీవో మంజులకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పనులు సరిగా జరగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఒక్క రోజు మాత్రమే పని ప్రారంభించి, ఫొటోలు రావడం లేదనే నెపంతో పనులు నిలిపివేయడం సరికాదన్నారు. మారుమూల ప్రాంతాల్లో రెండుసార్లు ఫొటోలు తీయాలనే నిబంధన కూలీలకు ఇబ్బందిగా మారిందని, లోపభూయిష్టంగా ఉన్న ఈ విధానాన్ని రద్దు చేసి అందరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, జిల్లా అధ్యక్షులు డాకూర్ తిరుపతి, నాయకులు పానుగంటి నరేష్, సుంకర లక్ష్మి, ఆడే పుష్ప తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

## వెంకట్రావుపేటలో ప్రత్యేక వైద్య శిబిరం

లక్షెట్టిపేట, మార్చి 26, ప్రభాతవార్త

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అనిత ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్య నిపుణుల చేతవైద్య శిబిరం నిర్వహించినట్లు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య శిభిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రవీణ్, గైనకాలజిస్ట్ డాక్టర్ రవళి, పిడియాట్రిక్ డాక్టర్ సాహితి, జనరల్ మెడిసిన్ సాయి పవన్, డెంటిస్ట్ డాక్టర్ షబ్బీర్‌లు 210 మందికి ఔట్ పేషెంట్ సేవలను అందజేశారు. ఈ వైద్య శిబిరంలో హెచ్ఈఒ జే.దేవేందర్, హెల్త్ సూపర్ వైజర్లు శోభ, మార్త, నర్సింగ్ ఆఫీసర్ సుమలత, ఫార్మాసిస్ట్ సుష్మ, హెల్త్ అసిస్టెంట్లు గఫూర్, వేణు, ఇసాక్ అహ్మద్, ల్యాబ్ టెక్నీషియన్ రాజన్న, ఎంఎల్‌హెచ్‌పిలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



## మందమర్రిలో పారిశుద్ధ్యంపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**- డంపింగ్ యార్డ్ పరిస్థితులపై సమీక్ష**

**- చెత్త నిర్వహణ మెరుగుపరచాలని ఆదేశాలు**

మందమర్రి, మార్చి26, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. యాపల్ ఏరియాలో కొనసాగుతున్న శుభ్రత కార్యక్రమాలను పరిశీలించి పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం చత్లాపూర్‌లో ఉన్న డంపింగ్ యార్డును తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. చెత్త నిర్వహణ విధానాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసూళ్లను మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి. సతీష్ కుమార్, రెవెన్యూ అధికారి పి. కృష్ణప్రసాద్, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఈ. వసంత్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ ఎం. గోపికృష్ణతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్యం దిశగా అడుగులు వేయండి. వ్యసనాలకు దూరంగా ఉండండి

**- విద్యార్థుల్లో చైతన్యం నింపిన చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ**

**- సైబర్ నేరాలు, మత్తు పదార్థాల పై అవగాహన**

కోటపల్లి, మార్చి 26, ప్రభాతవార్త

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకుని, వాటి సాధనలో ఎన్ని ఆటంకాలు వచ్చినా వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలని చెన్నూరు రూరల్ సీఐ కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని హెచ్చరించారు. క్రమశిక్షణతో కూడిన జీవితమే విజయానికి పునాది అని తెలిపారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే షీ టీమ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ప్రాణాపాయం మాత్రమే కాకుండా చట్టపరమైన చర్యలకు దారితీస్తుందని స్పష్టం చేశారు. "జీవితంలో ప్రతికూలతలు సహజం. కానీ లక్ష్యం మీద దృష్టి ఉంటే ఏ అడ్డంకీ మిమ్మల్ని ఆపలేదు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలి" అని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, ఫిజికల్ డైరెక్టర్ లింగయ్య, బబ్బెరచెల్క గ్రామ సర్పంచ్ ముల ప్రదీప్ రెడ్డి, ఉప సర్పంచ్, కానిస్టేబుల్స్ శ్రీనివాస్, వెంకన్న, రాజేందర్ దీక్షిత్, మోనిక, నరేష్ తదితరులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

# జన్నారంను అసెంబ్లీ నియోజకవర్గం చేయాలి

**- అసెంబ్లీ నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ డిమాండ్**

జన్నారం, మార్చి 26, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా జన్నారంను అసెంబ్లీ నియోజకవర్గం చేయాలని అసెంబ్లీ నియోజకవర్గ సాధన కమిటీ అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన ,స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ టైగర్ జోన్ ఏర్పడకముందు అన్ని రంగాలలో ముందుకు వెళుతున్న సమయంలో కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పడి అన్ని రంగాలలో వెనుకబడి పోయింది అని ,జన్నారం మండలంలో ఉన్న యువత ఉపాధి లేక పొట్ట చేత పట్టుకొని ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతున్నారు. భారీ వాహనాలకు అనుమతులు లేవు, ఉన్నవాటికి పరిమితులు ఉన్నాయి, వ్యాపారం పోయింది, గ్రామాలలో రోడ్లు లేవు ఇండ్లు కట్టుకుందామన్న ఇసుక లేదు వాగులపై కల్వర్టులు, బ్రిడ్జిలు లేవు, ఉన్నత విద్య సంస్థలు లేవు, పరిశ్రమలు లేవు, భవిష్యత్ లో జన్నారం మండలం ఇక్కడి నుండి లేపేసిన ఆశ్చర్యపోవాల్సినఅవసరం లేదని, అందుకే మనకు జన్నారం అసెంబ్లీ నియోజకవర్గం కావలసిన అవసరం ఎంతైనా ఉందిఅని అన్నారు. గతంలో లక్షెట్టిపేట్ నియోజకవర్గంలో ఉండేది ప్రస్తుతం ఖానాపూర్ నియోజకవర్గంలో ఉంది నాలుగు జిల్లాలకు కేంద్రమైన జన్నారం మాత్రం అభివృద్ధి కావడం లేదు అందుకే జన్నారం నియోజకవర్గం అయ్యేంతవరకుజన్నారం మండలంలో ఉన్న 29 గ్రామ పంచాయతీలలో పాదయాత్రలతో పాటు గ్రామపంచాయతీలో తీర్మానాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అలాగే లక్షెట్టిపేట నుంచి జన్నారం వరకు పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని అదేవిధంగా దశలవారీగా జన్నారం అసెంబ్లీ నియోజకవర్గం సాదించే వరకు ఉద్యమాలకు సిద్ధం కావాలని గవ్వల శ్రీకాంత్ అన్నారు. అదేవిధంగా శుక్రవారం నాడు ఉదయం 10:30 గంటలకు జన్నారం మండల కేంద్రంలో గల ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని, ఈ సమావేశంలో చర్చించడానికి పార్టీలకతీతంగా స్థానిక ప్రజా ప్రతినిధులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్మికులు, రైతులు, కూలీలు, రాజకీయ పార్టీల నాయకులు ప్రతి ఒక్కరు పాల్గొని భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కనికారం అశోక్, సర్పంచుల ఫోరం మండల ప్రధాన కార్యదర్శి పవర్ దినేష్ కుమార్, వడ్డెర సంఘం మండల అధ్యక్షులు బొంతల లక్ష్మణ్, వివిధ గ్రామాల సర్పంచులు లకవత్ సక్రూ నాయక్, వాసాల నరేష్, ఉద్యమ నాయకులు కొండపల్లి మహేష్, సయ్యద్ రిజ్వాన్, సీపీఎం మండల కార్యదర్శి కొండగుర్ల లింగన్న, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కామెర బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాల కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

**- శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ - ఎస్సార్పీ 3 గనిలో ఉత్పత్తి తీరుతెన్నుల పరిశీలన**

**- వచ్చే ఆర్థిక సంవత్సర లక్ష్యాలపై అధికారులకు దిశానిర్దేశం**

నస్పూర్, మార్చి 26, ప్రభాతవార్త



రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాల కోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. గురువారం ఉదయం ఆయన ఎస్సార్పీ 3 గనిని సందర్శించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఇప్పటి వరకు సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతలపై సమీక్ష నిర్వహించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్రీ సీమ్‌లోని ఎస్పి 3 ప్యానెల్ పని ప్రదేశాలలో ఉత్పత్తి తీరుతెన్నులను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి జరుగుతున్న చోట వర్కింగ్ కండీషన్స్ తనిఖీ చేశారు. మరో ఐదు రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనుంది. సంస్థ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేలా ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని మునిగంటి శ్రీనివాస్ అధికారులను కోరారు. నూతన పని ప్రదేశాల అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పనుల అనుమతుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు. కొత్తగా అభివృద్ధి చేయాల్సిన పని ప్రదేశాలు, వాటికి అవసరమైన అనుమతులు, అనుసరించాల్సిన వ్యూహాలపై అధికారులకు స్పష్టత ఇచ్చారు. అంతకుముందు గని మేనేజర్ కార్యాలయంలో గ్రూప్ ఏజెంట్, గని మేనేజర్, సర్వేయర్లతో కలిసి ప్రస్తుత పని ప్రదేశాల చార్ట్స్ పరిశీలించారు. ఈ ఏడాది సాధించిన ఉత్పత్తి, ఓఎంఎస్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన పనిముట్లు, మెటీరియల్స్ ముందుగానే సేకరించుకోవాలని సూచించారు. మెరుగైన ఓఎంఎస్తో రక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఉత్పత్తి పెంచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్పీ గ్రూప్ ఏజెంట్ జి. రవికుమార్, గని మేనేజర్ సిహెచ్. వెంకట్ రావు, సర్వేయర్ సుధాకర్ పాల్గొన్నారు.